సాక్షి
ప్రకాశం
బుధవారం । 24 । మే । 2023



**పెండింగ్ క్లెయిమ్‌లు పరిష్కరించాలి**

భూసేకరణ ప్రక్రియలో పెండింగ్ క్లెయిమ్‌లు పరిష్కరించాలని కలెక్టర్ దినేష్ కుమార్ అధికారులకు సూచించారు.

- 8లో..



**ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగండి**

ఉన్నత లక్ష్యంతో చిన్నారులు ముందుకు సాగాలని డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి అన్నారు. సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన తైక్వాండో శిక్షణ ముగింపులో పాల్గొన్నారు.

- 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
41 /28

**వాతావరణం**

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

## న్యూస్‌రీల్

### సీనియర్ రెసిడెంట్ పోస్టుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

**ఒంగోలు అర్బన్:** ప్రభుత్వ వైద్య కళాశాల, సర్వజన ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న వివిధ రకాల సీనియర్ రెసిడెంట్ పోస్టుల నియామకం కోసం గ్రాడ్యుయేషన్ అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ సాల్మాన్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు. www.rimsongoe.orf వెబ్‌సైట్‌లో దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకుని సంబంధిత ధ్రువపత్రాలను జతపరిచి వాటిని rimsongoe@yahoo.com కు ఈ మెయిల్ చేయాలన్నారు. కౌన్సిలింగ్‌కు హాజరయ్యే సమయంలో సంబంధిత ధ్రువపత్రాలు, దరఖాస్తును అటెస్టేషన్ చేయించి తీసుకురావాలని తెలిపారు.

### ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ

**ఒంగోలు అర్బన్:** పేద ప్రజలకు మరింత పౌష్టికాహారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఇంటింటికీ ఫోర్టిఫైడ్ బియ్యాన్ని సరఫరా చేయనుందని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఫోర్టిఫైడ్ బియ్యంలో బలవర్ధకమైన గ్రాన్యూల్స్ కలుపుతారని పేర్కొన్నారు. వీటి ద్వారా పోషణకు అవసరమైన విటమిన్ ఏ, ఫోలిక్‌యాసిడ్, విటమిన్ బి12, ఐరన్ వంటివి సంవృద్ధిగా ఉంటాయన్నారు. అయితే బియ్యం కడిగినప్పుడు గ్యాన్యూల్స్ పైకి తేలే అవకాశం ఉందని అలా తేలినపుడు తీసి పారవేయకుండా తిరిగి బియ్యంలో కలపాలని సూచించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### ఫెయిలైన అభ్యర్థులు 28లోపు పరీక్ష ఫీజు చెల్లించాలి

**ఒంగోలు:** ఏపీ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో ఫెయిలైన అభ్యర్థులు ఈనెల 28వ తేదీలోపు పరీక్ష ఫీజు చెల్లించాలని ఏపీ ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం విడుదలైన పరీక్ష ఫలితాల్లో పదో తరగతికి సంబంధించి 1583 మందికి 788 మంది, ఇంటర్‌కు సంబంధించి 4646 మందికిగాను 2653 మంది ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు. పరీక్ష ఫలితాలకు సంబంధించి ఎవరికైనా సందేహాలుంటే ఒక్కో సబ్జక్టుకు రూ.200 చొప్పున రీ కౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పరీక్ష పత్రం పునః సమీక్షకు సబ్జక్టుకు వెయ్యి రూపాయలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పరీక్షల్లో ఫెయిలైన అభ్యర్థులు ఈనెల 28వ తేదీలోపు పదో తరగతి విద్యార్థులు ఒక్కో సబ్జక్టుకు వంద రూపాయలు, ఇంటర్ విద్యార్థులు ఒక్కో సబ్జక్టుకు రూ.150 చొప్పున ఆన్‌లైన్ ద్వారా చెల్లించి సప్లిమెంటరీ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సప్లిమెంటరీ పరీక్షలు జూలై 4వతేదీ నుంచి ప్రారంభమవుతాయని ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరెడ్డి తెలిపారు.

### నాడు-నేడు పనులు వేగంగా పూర్తి చేయాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్



అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

**ఒంగోలు అర్బన్:** నాడు-నేడు కింద పాఠశాలల్లో చేపట్టిన పనులు వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ప్రకాశం భవనం నుంచి మండల స్థాయి అధికారులతో మంగళవారం వీడియో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ నాడు-నేడు పనులకు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలను జూన్ 12వ తేదీ లోపు పూర్తి చేయాలన్నారు. మండల ఇంజినీర్లు, ఎంఈఓలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. జగనన్న స్వచ్ఛ సకల్పంలో భాగంగా ఇంటింటి చెత్తను సక్రమంగా సేకరించాలన్నారు. మురుగు కాలువల్లో నీరు నిల్వ చేరకుండా చూడాలన్నారు. డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా నెలలో మొదటి, మూడవ శుక్రవారాల్లో నీళ్ల ట్యాంకులను శుభ్రం చేయాలన్నారు. ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌లలో వర్మీ పిట్స్ వివరాలను అప్‌లోడ్ చేయాలన్నారు. సచివాలయాల ద్వారా మెరుగైన సేవలు ప్రజలకు అందించాలని సూచించారు. సచివాలయ సిబ్బంది ఉదయం, సాయంత్రం విధిగా బయోమెట్రిక్ హాజరు కచ్చితంగా వేయాలన్నారు. సర్వీసులకు సంబంధించి వచ్చిన నగదును ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి జమ చేయాలని ఆదేశించారు. ఆయుష్మాన్ భారత్ రిజిస్ట్రేషన్‌లు త్వరగా పూర్తి చేయాలన్నారు. దీనిలో సీపీఓ వెంకటేశ్వర్లు, డీపీఓ నారాయణరెడ్డి, డ్వామా పీడీ శీనారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ బాబురావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్ అలీ, డీఈఓ రమేష్, సచివాలయాల కో ఆర్డినేటర్ ఉషారాణి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గ్లోరియా పాల్గొన్నారు.

# పల్లె స్వచ్ఛంగా..



గ్రామాల పరిశుభ్రత లక్ష్యంగా ప్రభుత్వం శ్రీకారం చుట్టిన 'జగనన్న స్వచ్ఛ సంకల్పం' సత్ఫలితాలనిస్తోంది. 'మన ఊరును మనమే పరిశుభ్రంగా చేసుకుందాం' అనే నినాదంతో ప్రారంభించిన ఈ కార్యక్రమం జిల్లాలోని 729 గ్రామాల్లో అమలు చేస్తున్నారు. ఒక వైపు తడి, పొడి చెత్తను సేకరిస్తూనే ఎస్‌డబ్ల్యూపీసీ (సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్)లను ఏర్పాటు చేసి చెత్త నుంచి సంపద సృష్టిస్తోంది. తద్వారా గ్రామాల్లో మెరుగైన పారిశుధ్యం, ప్రజారోగ్యంతో పాటు రైతులకు అవసరమైన వర్మీ కంపోస్ట్‌ను అతి తక్కువ ధరలకు అందజేస్తోంది. జిల్లాలోని 526 పంచాయతీలను ఆదర్శ గ్రామాలుగా ఎంపిక చేశారు.

- పంచాయతీల్లో పక్కాగా జగనన్న స్వచ్ఛ సంకల్పం అమలు
- ఎస్‌డబ్ల్యూపీసీ ద్వారా చెత్త నుంచి సంపద సృష్టి
- క్లాప్‌మిత్రల ద్వారా తడి, పొడి చెత్త సేకరణ
- జిల్లాలో 1945 మంది క్లాప్ మిత్రలు, 600 ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌లు
- షెడ్లలో చెత్త నుంచి వర్మీ కంపోస్ట్ తయారీ
- కేజీ రూ.10 చొప్పున ప్రజలకు కంపోస్ట్ సరఫరా
- వర్మీ కంపోస్ట్ ద్వారా ఇప్పటికి రూ.10 లక్షల వరకు రాబడి



కాఫీ విత్ క్లాప్‌మిత్ర కార్యక్రమంలో కలెక్టర్, డీపీఓ (ఫైల్)

**ఒంగోలు అర్బన్:** ''పరిశుభ్రం...ఆరోగ్యం.. ఆహ్లాదంగా గ్రామాలు మారాలి..'' ప్రజల ఆరోగ్యాలు మరింత మెరుగ్గా ఉండాలి. ఆరోగ్యకరమైన సమాజ స్థాపనే లక్ష్యంగా గ్రామీణ, పట్టణ ప్రజలకు మరింత మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించేందుకు 2021 అక్టోబర్ 2వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గ్రామ పంచాయతీలకు భారీ ఎత్తున యంత్ర పరికరాలు, వాహనాలను సమకూర్చింది. అంతేకాకుండా తడి పొడి చెత్త సేకరణ కోసం ఇంటింటికీ చెత్తబుట్టలను పంపిణీ చేసింది. ఇళ్లలోని చెత్తను తడి, పొడిగా వేరు చేసి ఇవ్వాలని, రోడ్లు, మురుగు కాలువలు ఏ విధంగా పరిశుభ్రంగా ఉంచాలి అనే అంశాలపై ఎంపిక చేసిన గ్రామాల్లో జిల్లా అధికారులు విస్తృతంగా ప్రచారం చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. గ్రామాలు, పట్టణాల్లో అవసరమైన చోట్ల సామాజిక మరుగుదొడ్లు నిర్మించేందుకు చర్యలు తీసుకున్నారు. గ్రామాల్లో ఎస్‌డబ్ల్యూపీసీ (సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్)లను ఏర్పాటు చేసి చెత్త నుంచి సంపద సృష్టిస్తున్నారు.

**తడి, పొడి చెత్త వేర్వేరుగా ..**

జిల్లా వ్యాప్తంగా మొత్తం 729 గ్రామ పంచాయతీలతో పాటు పట్టణాల్లోనూ ఇంటింటికీ రెండు చెత్త బుట్టలు పంపిణీ చేశారు. ఇళ్ల నుంచి చెత్త సేకరించేందుకు ప్రతి 250 ఇళ్లకు ఒక క్లాప్ మిత్రలను నియమించారు. ఈ ప్రక్రియపై పర్యవేక్షణకు పటిష్టమైన యంత్రాంగాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. జిల్లాలో మొత్తం 729 గ్రామ పంచాయతీల్లో 1945 మంది క్లాప్‌మిత్రలు పని చేస్తున్నారు. క్లాప్ (క్లీన్ ఆంధ్రప్రదేశ్) కార్యక్రమం కింద ప్రతిరోజు ఇళ్ల నుంచి తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం, చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాలకు తరలించి అక్కడే వర్మీ కంపోస్టు తయారు చేసి అతి తక్కువ ధరకు రైతులకు అందించడం క్లాప్ ముఖ్య ఉద్దేశంగా యంత్రాంగం పనిచేస్తోంది.

**వర్మీ కంపోస్టుతో సేంద్రియ ఎరువు సరఫరా:**

వర్మీ కంపోస్టు తయారు చేయడం, ద్రవ్య వ్యర్థాల నిర్వహణ ద్వారా చెత్త సమస్యకు పరిష్కారం లభించడమే కాకుండా గ్రామ పంచాయతీలకు కొంతమేర ఆదాయం సమకూరుతోంది. అంతే కాకుండా సేంద్రియ ఎరువుల ద్వారా వ్యవసాయ ఉత్పత్తులు పెరిగే అవకాశం కలుగుతోంది. ప్రస్తుతం జిల్లాలో 80 ప్రాంతాల్లో సేంద్రియ ఎరువు తయారవుతోంది. వర్మీ కంపోస్టును తయారు చేసి రైతు భరోసా కేంద్రాలు, డ్వామా, ఉద్యానవన శాఖల ద్వారా రైతులకు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 600 ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లను నిర్మించారు. 2 వేలకు పైగా జనాభా ఉన్న గ్రామ పంచాయతీల్లో 20-30 అడుగుల షెడ్ రూ.3.5 లక్షలు, 5 వేల జనాభా ఉంటే 20-50 చదరపు అడుగుల షెడ్ రూ.6.5 లక్షలు, 10వేలకు పైగా జనాభా ఉంటే 40-50 చ.అడుగుల షెడ్ రూ.11 లక్షలతో నిర్మించారు. ఈ కేంద్రాల్లో తయారు చేసిన వర్మీ కంపోస్ట్‌ను కేజి రూ.10 చొప్పున రైతులకు అందజేస్తున్నారు. ఇప్పటి వరకు వర్మీ కంపోస్టు అమ్మకాల ద్వారా సుమారు రూ.10 లక్షల వరకు ఆదాయం వచ్చింది. జిల్లాలో 729 పంచాయతీల్లో చెత్తను ఇళ్ల నుంచి సేకరించి షెడ్లకు చేర్చేందుకు 1963 ట్రైసైకిల్స్, 58 ఆటోలు, 58 ట్రాక్టర్లు ఉన్నాయి. ఇవి కాకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలకు అవసరమైన బ్రష్ కటర్‌లు, ఫాగింగ్ యంత్రాలు, హైప్రెషర్ టాయిలెట్ క్లీనర్లు వినియోగిస్తున్నారు.

**526 ఆదర్శ గ్రామాలు:**

తొలి విడతలో మండలానికి ఒకటి చొప్పున 38 గ్రామాలను ఎంపిక చేసి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దారు. ఇప్పటి వరకూ 8 విడతల్లో 526 పంచాయతీలను ఆదర్శ గ్రామాలుగా ప్రకటించారు.

**ఆదర్శ జిల్లాగా మారుస్తాం...**



జగనన్న స్వచ్ఛ సంకల్పం కింద జిల్లాలో గ్రామ పంచాయతీలను ఆదర్శ పంచాయతీలుగా తీర్చిదిద్దుతున్నాం. క్రమేపీ జిల్లాను ఆదర్శ జిల్లాగా మార్చేందుకు పక్కా ప్రణాళికతో దశల వారీగా కార్యక్రమాలు చేపడుతున్నాం. ఇప్పటికి 8 దశల్లో 526 ఆదర్శ గ్రామాలను ప్రకటించాం. కార్యక్రమాలను జిల్లాలో నిరంతరం జిల్లా అధికారులు పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నాం. క్యాంపునకు వెళ్లినప్పుడు తప్పనిసరిగా చెత్త సంపద కేంద్రాలతో పాటు స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాలపై కూడా తనిఖీలు చేస్తున్నాం. డ్రైడే ఫ్రైడే కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రజలు కూడా వారి గ్రామాలను చూడ చక్కగా చేసుకునేందుకు చేయి చేయి కలిపి పారిశుధ్య విధానాలు పాటించాలి.

– ఏఎస్ దినేష్ కుమార్, కలెక్టర్

**చూడచక్కని గ్రామాలతో పాటు ప్రజారోగ్యం పరిరక్షణ**



రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న క్లాప్ కార్యక్రమం ద్వారా జిల్లాలో చూడచక్కని పరిశుభ్ర గ్రామాలుగా, ప్రజారోగ్యం పరిరక్షించేలా పంచాయతీలను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం. ప్రజలు కూడా పారిశుద్ధ్యం పట్ల అవగాహన పెంచుకుని ఇళ్లలోని చెత్తను గ్రీన్ అంబాసిడర్‌లకు అందచేయడం లేదా గ్రామ పంచాయతీ ఏర్పాటు చేసిన వరల తొట్టిలో మాత్రమే వేయాలి. రోడ్లపై, కాలువల్లో చెత్తను వేయకుండా గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా మార్చేందుకు ప్రజలు భాగస్వాములు కావాలి. కాఫీ విత్ క్లాప్ మిత్ర కార్యక్రమం ద్వారా వారికి మరింత ఉత్సాహం నింపుతున్నాం.

– నారాయణ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి

# నిస్వార్థ సేవకులు వలంటీర్లు

- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్



సేవా వజ్ర అవార్డు గ్రహీతను సన్మానిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

**యర్రగొండపాలెం:** నిస్వార్థ సేవకులు వలంటీర్లని, కేవలం గౌరవ వేతనం తీసుకుంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసి సీఎం జగనన్నకు మంచి పేరు తీసుకొస్తున్నారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. త్రిపురాంతకం మండలంలో పనిచేస్తున్న వలంటీర్ల సేవలకు గుర్తింపుగా సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పురస్కారాలు అందించేందుకు మంగళవారం త్రిపురాంతకేశ్వర ఆలయం వద్ద ఉన్న ఆర్యవైశ్య నిత్యఅన్నదాన సత్రంలో ఏర్పాటు చేసిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వంలో భాగస్వాములైన వలంటీర్లు పార్టీలకు అతీతంగా ప్రజలకు సేవలు అందిస్తున్నారని, సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేసే బాధ్యతను ప్రభుత్వం వలంటీర్లపై పెట్టిందని చెప్పారు. పారదర్శకం, జవాబుదారితనం, అవినీతి రహితంగా పనిచేస్తున్న వలంటీర్లను పచ్చనేతలు విమర్శిస్తున్నారని ఆయన అన్నారు. ప్రతినెలా క్రమం తప్పకుండా పింఛన్లు పంపిణీ చేయడంతోపాటు అధికార పార్టీకి చెందిన నాయకుల ప్రమేయంలేకుండా ప్రజలు తమ సమస్యలను ఇంటివద్దే ఉండి పరిష్కరించుకో గలుగుతున్నారంటే అది వలంటీర్ వ్యవస్థతోనేనని చెప్పారు.

**టీడీపీ హయాంలో నిర్వీర్యమైన సంక్షేమ పథకాలు:**

టీడీపీ ప్రభుత్వ కాలంలో సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేశారని, పింఛన్ కావాలన్నా, ఇంటి స్థలం కోసం, గృహనిర్మాణానికి రుణం మంజూరు చేసుకోవటానికి జన్మభూమి కమిటీల ఇళ్ల వద్ద పడి కాపులు కాయాల్సి వచ్చేదన్నారు. ప్రజల నుంచి డబ్బులు గుంజి పనులు చేసేవారని ఆయన విమర్శించారు. 2014 నుంచి పచ్చనేతలతో అనేక బాధలు పడిన రాష్ట్ర ప్రజలు 2019లో టీడీపీని భూ స్థాపితం చేశారని అన్నారు. తిరిగి అధికారంలోకి రావటానికి చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ రాష్ట్రంపై పడ్డారని, కులాలను రెచ్చకొడుతున్నారన్నారు. వారి చేష్టలను రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని, 2024 జరిగే ఎన్నికల్లో వారితోపాటు వారికి మద్దతు తెలుపుతున్న వారంతా అడ్రస్ లేకుండా పోతారని చెప్పారు.

**వలంటీర్ల సేవలకు ప్రతిఫలం ఉంటుంది:**

జగనన్న ప్రగతి సారథులుగా పనిచేస్తున్న వలంటీర్లకు ముఖ్యంగా పురస్కారాలు అందుకున్న వారికి భవిష్యత్తులో మంచి ప్రతిఫలం ఉంటుందన్నారు. వలంటీర్లే కాబోయే నాయకులు అని జగనన్న నోటి నుంచి వచ్చిన మాట వాస్తవ రూపం దాల్చుతుందని, తామందరం ప్రజా సేవకులమని, ఆ స్ఫూర్తితోనే పనిచేసి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి మంచి పేరు తీసుకొచ్చి తిరిగి ఆయననే సీఎం చేసుకుందామని ఆయన హర్షధ్వానాల మధ్య అన్నారు. అనంతరం రామసముద్రంకు చెందిన దేశిరెడ్డి వెంకట రమణ సేవా వజ్ర, సోమేపల్లికి చెందిన కె.అంకారావు, డి.వెంకటశివయ్య, వెల్లంపల్లికి చెందిన డి.బాబు, రామసముద్రంకు చెందిన డి.బాలసుబ్బారెడ్డి, త్రిపురాంతకంకు చెందిన బి.శ్రీనివాసులుకు సేవా రత్న అవార్డులు అందుకున్నారు. వీరికి మంత్రి శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో బి.వి.ఎస్.సాయి కుమార్, తహసీల్దార్ కిరణ్, ఎంపీడీవో మరియదాసు, ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ ఆళ్ల ఆంజనేయరెడ్డి, జడ్పీటీసీ మాకం జాన్‌పాల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆర్.సుశీలపిచ్చయ్య, పార్టీ మండల అధ్యక్షుడు పోలిరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ ఎల్లారెడ్డి, సర్పంచ్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

# నేడు జగనన్న విద్యాదీవెన

- రెండో విడత నిధులు విడుదల
- జిల్లాలో 37,415 మంది విద్యార్థుల తల్లుల ఖాతాలకు నిధులు
- జమకానున్న మొత్తం రూ.34.71 కోట్లు
- నేడు స్పందన కాన్ఫరెన్స్ హాలు, అన్ని నియోజకవర్గాల్లో కార్యక్రమాలు
- పాల్గొననున్న ప్రజాప్రతినిధులు



**ఒంగోలు:** జగనన్న విద్యాదీవెన 2022-23 రెండో త్రైమాసిక నిధులు బుధవారం విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమకానున్నాయి. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు గ్రామంలో జరిగే కార్యక్రమంలో నిధులు విడుదల చేయనున్నారు. అదే సమయంలో స్థానిక ప్రకాశం భవనంలోని స్పందన కాన్ఫరెన్స్‌హాలులో కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగే మెగా చెక్కు పంపిణీ కార్యక్రమానికి జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరుకానున్నారు. జిల్లాలో ఈ ఏడాది మొదటి త్రైమాసికానికి సంబంధించి మొత్తం రూ.34.71 కోట్లను ప్రభుత్వం విడుదల చేస్తుంది.


**జిల్లాలో 33794 మంది తల్లుల ఖాతాల్లో నిధులు జమ:**

డిగ్రీ, పీజీతోపాటు ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు అభ్యసించే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ వర్గాలకు చెందిన విద్యార్థులకు ఈ నిధులు విడుదల కానున్నాయి. జిల్లాలో 37,415 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తుండగా వారి తల్లులు 33,794 మంది ఉన్నారు. వీరందరి బ్యాంకు ఖాతాల్లో బుధవారం నుంచి నిధులు జమకానున్నాయి. ఎస్సీ విద్యార్థులు 218, ఎస్టీ 1259, బీసీ 16518, ఈబీసీ 13217, ముస్లిం మైనార్టీ 3168, కాపు 2977, క్రిస్టియన్ మైనార్టీ 58 మంది విద్యార్థులకు సంబంధించిన నిధులు వారి తల్లుల ఖతాల్లో జమవుతాయి. అదే విధంగా 12,913 మంది ఎస్సీ విద్యార్థులకు (తల్లులు 11,541 మంది) విద్యా సంవత్సరానికి చెల్లించే మొత్తం ఫీజులో 40 శాతం రూ.12 కోట్లు ఈ ఏడాది మార్చిలో ప్రభుత్వం జమ చేసింది. మిగిలిన 60 శాతం నిధులను అంటే అదనంగా మరో రూ.18 కోట్లు కూడా ఈ కార్యక్రమంతోపాటే జమచేయనున్నారు. ఈ సందర్భంగా అన్ని కాలేజీలు, జిల్లా కేంద్రంతోపాటు నియోజకవర్గ కేంద్రాల్లో ఉదయం 11గంటలకు జరిగే కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు ప్రజాప్రతినిధులు, విద్యార్థులు హాజరయ్యేలా సహాయ సంక్షేమ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలంటూ జిల్లా షెడ్యూల్డు కులాల సంక్షేమం, సాధికారత అధికారి, నోడల్ అధికారి యన్.లక్ష్మానాయక్ ఆదేశించారు.

| సంక్షేమ శాఖ | విద్యార్థుల సంఖ్య | విద్యార్థుల తల్లుల సంఖ్య | విడుదల అవుతున్న మొత్తం (రూ.) |
|---|---|---|---|
| ఎస్సీ | 218 | 217 (11,541 మంది కాకుండా) | 34,64,004 |
| ఎస్టీ | 1259 | 1128 | 90,32,313 |
| బీసీ | 16,518 | 14,827 | 13,12,82,267 |
| ఈబీసీ | 13,217 | 12,010 | 15,18,10,747 |
| ముస్లిం మైనార్టీ | 3168 | 2,839 | 2,42,99,161 |
| కాపు | 2,977 | 2,719 | 2,65,40,889 |
| క్రిస్టియన్ మైనార్టీ | 58 | 54 | 7,32,796 |
| మొత్తం | 37,415 | 33,794 | 34,71,62,177 |

# అనుకున్నది సాధించి..

సివిల్స్‌లో ఒంగోలు అమ్మాయి జాతీయస్థాయిలో మెరుగైన ర్యాంకులు సాధించి సత్తా చాటింది. పట్టు విడవకుండా అనుకున్నది సాధించింది బొల్లిపల్లి వినూత్న . జాతీయ స్థాయిలో 462వ ర్యాంకు సాధించింది. ఐఏఎస్ కావాలన్న మక్కువతో సాఫ్ట్‌వేర్ కొలువు సైతం కాదనుకుని అనుకున్న లక్ష్యాన్ని సాధించింది. ఆమె కుటుంబ సభ్యుల ఆనందానికి అవధుల్లేవు.



వినూత్నతో తల్లిదండ్రులు, సోదరి

- సాఫ్ట్‌వేర్ కొలువులు వదిలి సివిల్స్ వైపు
- జాతీయ స్థాయిలో 462వ ర్యాంకు
- కుటుంబ సభ్యుల్లో వెల్లివిరిసిన ఆనందం

**ఒంగోలు:** వినూత్న తండ్రి ప్రస్తుతం నాగులుప్పలపాడు మండలం చదలవాడ పశుక్షేత్రం డిప్యూటీ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తల్లి సుభాషిణి సేంద్రియ వ్యవసాయం జిల్లా మేనేజర్‌గా పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు కాగా పెద్ద కుమార్తె వినూత్న . ప్రాథమిక విద్యాభ్యాసం ఒంగోలులోని కృష్ణా మెమోరియల్ స్కూల్‌లో, ఉన్నత పాఠశాల విద్య స్థానిక శివాని స్కూలులో అభ్యసించింది. విజయవాడ శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్, బీటెక్ బెంగళూరు అమృత కాలేజీలో చేసింది. బీటెక్‌లో ఆమె మెకానికల్ బ్రాంచ్ తీసుకుంది. ఆ బ్యాచ్ మొత్తంలో అందరు అబ్బాయిలు కాగా వినూత్న ఒక్కరే విద్యార్థిని. తల్లిదండ్రులను ఒప్పించి మరీ మెకానిక్‌లో చేరింది. అనంతరం కోల్‌కతాలో కాగ్నిజెంట్ కంపెనీలో రూ.45 వేలు నెలకు జీతంతో ఉద్యోగం లభించింది. అయితే ఢిల్లీలో ఐఏఎస్ కోచింగ్ ఎలా ఉంటుందో ప్రయత్నించింది. అంతే అక్కడకు చేరిన తరువాత లక్ష్యం ఐఏఎస్‌గా మార్చుకుంది. ఆమె ఎంచుకున్న లక్ష్యానికి తల్లిదండ్రులు కూడా సరే అన్నారు. అక్కడ లక్ష్మయ్య ఐఏఎస్ కోచింగ్ సెంటర్‌లో 2017లో చేరింది. తొలి ప్రయత్నం ప్రిలిమినరీకి కూడా సక్సెస్ కాలేదు, రెండో యత్నంలో ప్రిలిమనరీ సాధించింది. కానీ మెయిన్స్‌లో రాణించలేదు. మూడో యత్నంలో ప్రిలిమినరీతోపాటు మెయిన్స్‌లోనూ సక్సెస్ అయింది. కానీ ఇంటర్వ్యూలో రాణించలేకపోయింది. నాలుగో యత్నం నిరాశపరిచింది.

అయితే పట్టుదల ఉంటే దేనినైనా సాధించగలమంటూ అయిదోసారి కుటుంబ సభ్యులకు అద్భుతమైన న్యూస్ అందించింది. జాతీయ స్థాయిలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించిన ఫలితాల్లో ఎస్సీ మహిళ కోటాలో 462వ ర్యాంకు సాధించింది. దీంతో అటు వినూత్న, ఇటు కుటుంబ సభ్యుల ఆనందానికి అవధులు లేవు. గత ఏడాది 508వ ర్యాంకుకే ఐఏఎస్ రావడం, ఈ ఏడాది సీట్లు ఎక్కువగా ఉండడం, ర్యాంకు 462 కావడంతో తప్పకుండా ఐఏఎస్ వస్తుందని అందులో మరో ఆలోచనే అవసరం లేదంటూ కోచింగ్ సెంటర్ యజమాని లక్ష్మయ్య స్పష్టం చేయడంతో తాను ఎంచుకున్న రంగాన్ని అందుకున్నందుకు ఆనందంగా ఉందని, ఇది మాటల్లో చెప్పలేని భావన అంటూ వినూత్న తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. ఐఏఎస్ రాసే క్రమంలో గ్రూప్-1 రాసి ఇంటర్వ్యూకు ఎంపికైందని, అయితే ఇంటర్వ్యూకు అటెండ్ కానని తన లక్ష్యం ఐఏఎస్ అని స్పష్టం చేసింది. వినూత్న సోదరి ప్రస్తుతం వైజాగ్‌లో ఎంఎస్ సర్జన్ చేస్తోంది.

# పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత



మాట్లాడుతున్న ఏకేయూ వీసీ మారెడ్డి అంజిరెడ్డి

**ఒంగోలు:** పర్యావరణ పరిరక్షణ సమాజిక బాధ్యత అని ఆంధ్రకేసరి విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్, ప్రొఫెసర్ మారెడ్డి అంజిరెడ్డి అన్నారు. మంగళవారం నేషనల్ సర్వీస్ స్కీమ్ (ఎన్ఎస్ఎస్) వలంటీర్ల రెగ్యులర్ ప్రోగ్రాం సర్టిఫికెట్స్ పంపిణీకి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పర్యావరణాన్ని కాపాడడంలో కీలక భూమిక పోషించాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో, నగర ప్రాంతాల్లో చెట్లను విరివిగా పెంచే విధానంలో, కాలుష్య నియంత్రణలో ప్రజలను చైతన్యం చేయడంలో వాలంటీర్లు కృషిచేయాలన్నారు. యూనివర్శిటీ రిజిస్ట్రార్ హరిబాబు మాట్లాడుతూ ఓజోన్ పొరను కాలుష్యం నుంచి కాపాడడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలను చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమానికి జిల్లా ఎన్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మండే హర్షప్రీతమ్‌దేవ్ కుమార్ అధ్యక్షత వహించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లను వీసీ ప్రదానం చేశారు.

# ఫోర్జరీ కేసులో ఆంజనేయులు అరెస్టు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి

● డీఎస్పీ నారాయణ స్వామిరెడ్డి

ఒంగోలు టౌన్: ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి లేని భూమిని విక్రయించే పేరుతో భారీగా డబ్బులు వసూలు చేసిన తోట ఆంజనేయులును అరెస్టు చేసినట్లు ఒంగోలు డీఎస్పీ వి.నారాయణస్వామిరెడ్డి తెలిపారు. స్థానిక తాలుకా పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఒంగోలు ఇందుర్తినగర్‌కు చెందిన ఇందుర్తి నరేష్ చేసిన ఫిర్యాదు మేరకు అరెస్టు చేసినట్లు చెప్పారు. నిందితుడు ఆంజనేయులు ఫేక్ అగ్రిమెంట్ తయారు చేసి దాన్ని విక్రయించేందుకు ప్రయత్నించాడు. నిందితుడి మాటలను నమ్మిన నరేష్ స్థలం కొనేందుకు సిద్ధపడ్డారు. ఇందుకు రూ.15 లక్షల వరకు అడ్వాన్స్ చెల్లించాడు. తీరా చూస్తే కాగితాల మీద తప్ప వాస్తవానికి స్థలం లేకపోవడంతో నరేష్ తాలుకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న తాలుకా పోలీసులు సోమవారం రాత్రి ఆంజనేయులును అరెస్టు చేశారు. మరో ఇద్దరు కూడా కేసులో నిందితులుగా ఉన్నారని, మిగిలిన వారిని కూడా అరెస్టు చేస్తామని డీఎస్పీ తెలిపారు. ఫోర్జరీ డాక్యుమెంట్‌ను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించనున్నట్లు చెప్పారు. నిందితుడిని అరెస్టు చేసిన తరువాత కొందరు వ్యక్తులు పోలీసుస్టేషన్ వద్ద పెట్రోలు పోసుకుంటామని హంగామా సృష్టించారని, వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కేసు విచారణలో నిందితుడిపై గతంలో వైజాగ్, అనంతపురంలలో అనేక ఆరోపణలు ఉన్నాయని తెలిసిందన్నారు. వైజాగ్ పోర్టులో ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేసి మోసం చేశాడని, అనంతపురంలో భూములకు మోసాలతో పాటు ఉద్యోగాల పేరుతోనూ నగదు వసూలు చేశారని తేలిందని, ఈ కేసులను ఆయా ప్రాంతాల పోలీసు అధికారులు విచారణ చేస్తున్నారన్నారు. నిందితుడు ఆంజనేయులు గతంలో విశాఖలో ఓ రియల్ ఎస్టేట్ కంపెనీలో పనిచేశాడని, అక్కడ బ్యాంకు రుణాలు, ఇన్‌కం ట్యాక్స్ వ్యవహారాల విషయంలో అవకతవకలకు పాల్పడడంతో పనిలో నుంచి తొలగించినట్లు సమాచారం ఉందని చెప్పారు. అనంతపురంలో భూముల కొనుగోలు విషయంలో, అచ్యుతాపురం లే అవుట్‌కు సంబంధించిన ప్లాట్లలో అమ్మకాలు, బ్యాంకులో ఉన్న నగదు విత్ డ్రా చేసుకోవడ వంటి అనేక విషయాల్లో కోట్ల రుపాయలను నిందితుడు స్వలాభానికి వాడుకున్నాడని తెలిపారు. తాలుకా సీఐ రాంబాబు, ఎస్సై అంకమ తదితరులు పాల్గొన్నారు.





## గుండెపోటుతో ఏఎస్సై మృతి

కొనకనమిట్ల: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న షేక్ హసన్ సాహెబ్(58) గుండెపోటుతో మృతి చెందారు. పొదిలిలో నివాసం ఉండే హసన్ సాహెబ్ సోమవారం రాత్రి ఊపిరి ఆడటం లేదని చెప్పటంతో బంధువులు ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా..అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్, పొదిలి సీఐ రాఘవేంద్ర, కొనకనమిట్ల ఎస్సై దీపిక, స్టేషన్ సిబ్బంది మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. హసన్ సాహెబ్ మృతదేహాన్ని స్వగ్రామమైన జె.పంగలూరు తీసుకెళ్లి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.





# ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగండి



● ఒంగోలు డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి

ఒంగోలు: ఉన్నత లక్ష్యంతో చిన్నారులు ముందుకు సాగాలని ఒంగోలు డీఎస్పీ వి.నారాయణస్వామిరెడ్డి అన్నారు. సాక్షి మీడియా ఆధ్వర్యంలో స్థానిక సీవీఎన్ రీడింగ్ రూం ఆవరణలో మంగళవారం తైక్వాండో శిక్షణ ముగింపు, పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానోత్సవానికి డీఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాజంలో సామాజిక స్పృహను తట్టి లేపాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. సామాజిక స్పృహను తట్టిలేపే కార్యక్రమాల నిర్వహణకు ముందుకు వచ్చిన సాక్షి మీడియాకు అభినందనలు తెలిపారు. సమాజంలో క్రమశిక్షణ లేని వారి వల్ల శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని, అటువంటి వాటికి చెక్ పెట్టాలంటే చిన్నతనం నుంచే ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ కలిగిన జీవనశైలి అలవాటు చేసుకోవాలన్నారు. ఆరోగ్యంగా ఉండాలన్నా, తమను తాము కాపాడుకోవాలన్నా తైక్వాండో శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని సూచించారు. మహిళల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని, అందులో భాగంగా దిశ యాప్‌ను తీసుకువచ్చి అండగా నిలుస్తుందన్నారు. ఆడ పిల్లల జోలికి వెళ్లాలంటే భయపడే పరిస్థితులు రావాలని, అందుకు తైక్వాండో శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఇటువంటి శిక్షణకు కుమార్తెలను పంపుతున్న తల్లిదండ్రులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. సాక్షి బ్యూరో ఇన్‌చార్జి మాధవరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో ఆత్మస్థైర్యాన్ని కల్పించాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఎడిషన్ ఇన్‌చార్జి రవిచంద్ర మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి సమయపాలన ముఖ్యమని, ఈ విషయాన్ని చిన్నతనం నుంచే తెలియజేసేందుకు విజేతలకు గడియారాలు ఇస్తున్నట్లు తెలిపారు. తైక్వాండో కోచ్ షేక్ కరీముల్లా మాట్లాడుతూ ఇటువంటి మంచి కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సాక్షి మీడియా ముందుకు రావడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఒంగోలు డీఎస్పీ నారాయణస్వామిరెడ్డితో పాటు కోచ్ షేక్ కరిముల్లాను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. విజేతలైన చిన్నారులకు బహుమతులు అందించగా పాల్గొన్న ప్రతి ఒక్కరికీ చిరు బహుమతి అందించారు.



మాట్లాడుతున్న డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీఎస్పీ

## ట్రావెల్స్ బస్సు బీభత్సం


ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో బోల్తాపడిన ఆటో

కొమరోలు: ఓ ట్రావెల్ బస్సు వేగంగా వెళుతూ ఆగి ఉన్న రెండు వాహనాలను ఢీకొట్టి బీభత్సం సృష్టించింది. వివరాల్లోకి వెళితే..పోరుమామిళ్ల వైపు నుంచి మార్కాపురం వైపుగా వెళుతున్న ట్రావెల్స్ బస్సు వేగంగా వెళుతూ కడప-అమరావతి రాష్ట్రీయ రహదారిలోని తాటిచెర్లమోటు జంక్షన్ వద్ద ఆగి ఉన్న ఆటో, కారును వేగంగా ఢీకొంది. ప్రమాదంలో ఆటో బోల్తా పడగా..కారు దెబ్బతింది. వాహనాల్లో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రాణాపాయం తప్పడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

## ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి

కొత్తపట్నం: గుర్తు తెలియని వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం ...కొత్తపట్నంలోని కై లాస్ హేచరీ సమీపంలో ఉన్న సరుగుడు చెట్లలో ఉరేసుకొని వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని చుట్టుపక్కల ఉన్న రైతులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సాంబశివరావు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని కిందకు దించి పరిశీలించగా ఎటువంటి ఆధారాలు లభించలేదు. మృతునికి 45 ఏళ్ల ఉంటాయని భావిస్తున్నారు. మృతుని సమాచారం తెలిస్తే ఎస్సై ఫోన్ నంబర్ 9121102126కు సమాచారం ఇవ్వాలని కోరారు.

## పెండింగ్ క్లెయిమ్‌లు త్వరగా పరిష్కరించాలి

● కలెక్టర్ దినేష్‌కుమార్


భూసేకరణ ప్రక్రియపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్, జేసీ

ఒంగోలు అర్బన్: భూ సేకరణ ప్రక్రియలో పెండింగ్ క్లెయిమ్‌లు త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులకు సూచించారు. స్పందన భవనంలో మంగళవారం జిల్లా నుంచి వెళ్లే రహదారులు, రైల్వే మార్గాల విస్తరణ భూసేకరణ, నిర్వాసితుల పరిహారం తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. బెంగళూరు-కడప-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే, 216, 565, 544(డి), 167(బి) జాతీయ రహదారులు, గూడూరు-విజయవాడ రైల్వేమార్గం ట్రిప్లింగ్, నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే మార్గ విస్తరణ, రాష్ట్ర రహదారులకు భూ సేకరణ తదితర అంశాలపై చర్చించారు. పెండింగ్ క్లెయిమ్‌లు, 3డీ ప్రతిపాదనలు, పరిహార చెల్లింపు నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు, నిర్వాసితుల బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం వంటి అంశాలపై ఆరా తీశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, మార్కాపురం సబ్ కలెక్టర్ సేతుమాధవన్, ట్రైనీ ఐపీఎస్ అంకితాసురానా, డీఆర్‌ఓ శ్రీలత, ఒంగోలు, కనిగిరి ఆర్‌డీఓలు విశ్వేశ్వరరావు, విజయ్‌కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు ఉమాదేవి, గ్లోరియా, తహసీల్దార్ పాల్గొన్నారు.

## నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

● వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకుడు కృపాదాస్

నెల్లూరు(సెంట్రల్): పంటలకు వినియోగించే పురుగు మందులు, ఎరువులు, విత్తనాలకు సంబంధించి నాణ్యతా ప్రమాణాలు పాటించాలని వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకుడు కృపాదాస్ అన్నారు. నెల్లూరులోని వ్యవసాయ పరిశోధన స్థానంలో ప్రకాశం, నెల్లూరు జిల్లాల వ్యవసాయ అధికారులు, సిబ్బందికి మంగళవారం విత్తనాలు, పురుగు మందులు, ఎరువుల నియంత్రణ చట్టం అమలుపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కృపాదాస్ మాట్లాడుతూ పంటలకు వినియోగించే పురుగు మందులు, ఎరువుల విషయంలో అధికారులు అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎటువంటి చట్టాలు ఉన్నాయి, విక్రయదారులు అతిక్రమిస్తే ఏ చర్యలు తీసుకోవాలనే విషయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రైతులకు ఎక్కడా ఇబ్బందుల్లేకుండా చూడాలన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్‌రాజు మాట్లాడుతూ షాపులను నిత్యం తనిఖీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు వెంకటేశ్వరరావు, రాజన్, సుదర్శనరాజు, మద్దలేటి, నర్సోజీ, సురేష్, శ్రీనివాసులు, మంజుల పాల్గొన్నారు.

## ఐదుగురు వేటగాళ్లు అరెస్టు

● మూషిక జింక, ఆరు ఉడుములు స్వాధీనం


పట్టుబడ్డ వేటగాళ్లతో అటవీశాఖ అధికారులు


చనిపోయిన మూసికజింక, ఉడుములు

గిద్దలూరు రూరల్: మండలంలోని దిగువమెట్ట గ్రామ సమీపంలోని గుండ్లకమ్మ రేంజ్ పరిధిలో వన్యప్రాణులను వేటాడిన ఐదుగురు వ్యక్తులను అటవీ శాఖాధికారులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. అటవీప్రాంతంలో దిగువమెట్టకు చెందిన ఐదుగురు వ్యక్తులు వన్యప్రాణులను వేటాడుతున్నారని రేంజ్ ఆఫీసర్ జీవన్‌కుమార్‌కు సమాచారం అందడంతో డిప్యూటీ రేంజర్ వంశీక్రిష్ణ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి సోదాలు చేశారు. అధికారులను గమనించి వేటగాళ్లు అక్కడ నుంచి పారిపోయేందుకు ప్రయత్నించగా వారిని వెంబడించి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి అటవీప్రాంతంలో అరుదుగా కనిపించే మూషిక జింక, ఆరు ఉడుములు స్వాధీనం చేసుకున్నారు. ఉడుముల్లో మూడు చనిపోయి ఉండగా, మూడు జీవించి ఉన్నాయి. బతికి ఉన్న ఉడుములను అడవిలోనే వదిలేసి చనిపోయిన మూడు ఉడుములను, మూసిక జింకను అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అటవీ శాఖాధికారులు తెలిపారు. దాడుల్లో ఎఫ్‌బీఓలు ఖయూమ్, తేజ, సిబ్బంది పాల్గొన్నారు.